క్లుప్తంగా

కిడ్నీ బాధితునికి పింఛన్


పింఛన్ అందిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో కిడ్నీ బాధితుడు అలపాన దుర్గారావుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల పింఛన్‌ను మంగళవారం సర్పంచ్ ముద్దాడ గౌరీ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ సురేష్, హరి, నాయకులు మజ్జి రమణ, అలపాన శ్రీనివాసరావురెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ పొగిరి రాము పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో మేలు


కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ సన్నద్ధంలో భాగంగా నవధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలని సేంద్రియ వ్యవసాయ సాగు మండల యాంకర్ సీహెచ్ వెంకటరమణ అన్నారు. ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా మంగళవారం కొత్తపేటలో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని పిలుపునిచ్చారు. నవధాన్యాలు సాగు చేసి 40 నుంచి 45 రోజుల మధ్య దుక్కి దున్నితే భూసారం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరమణ, రజిని, రాణి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూముల సర్వేతో మేలు


పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ధర్మారావు

లావేరు: సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు కలుగుతుందని గుమడాం పంచాయతీ సర్పంచ్ దురగాసి ధర్మారావు అన్నారు. పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురంలో సమగ్ర భూముల సర్వే పూర్తి కావడంతో రైతులకు మంజూరైన పట్టాదారు పాస్‌పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులకు భూసమస్యలు ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర భూముల సర్వే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబరు రేగిడి లక్ష్మణరావు, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి


సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ శ్రీనివాసరావు

లావేరు: గ్యాస్ వినియోగంలో మహిళలు జాగ్రత్తలు పాటించాలని శ్రీకాకుళం నగరానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ డబ్బీరు శ్రీనివాసరావు(వాసు) అన్నారు. గురుగుబిల్లిలో మంగళవారం హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో గ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టవ్ వెలిగించాక ఇంటి పనుల్లో నిమగ్నమై గ్యాస్ విషయం మర్చిపోకూడదన్నారు. వంట పూర్తయ్యాక రెగ్యులేటర్‌ను కూడా ఆపి వేయాలన్నారు. గ్యాస్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలకల దుర్గమ్మ, ఎఫ్‌పీ నేతల రామారావు, నీటి సంఘం అధ్యక్షుడు బి.చిట్టిబాబు, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యువతిని ఇంటికి చేర్చిన పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ వంతెన ఫుట్‌పాత్ పక్కన రక్షణ గోడపై ప్రమాదకరంగా కూర్చున్న శ్రీకాకుళం నగరానికి చెందిన యువతికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒకటో పట్టణ హెడ్ కానిస్టేబుల్ బొమ్మాళి రవికుమార్ యువతి నిర్లక్ష్యంగా కూర్చున్నందుకు ప్రశ్నించారు. పూర్తి వివరాలు తెలుసుకుని ఇంటికి చేర్చారు.

వేణుగోపాలపురంలో పారిశుద్ధ్య పనులు

లావేరు: మండలంలోని వేణుగోపాలపురంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గుమడాం పంచాయతీ సర్పంచ్ దురగాసి ధర్మారావు, కార్యదర్శి శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో పూడిక తీయించారు. జనావాసాల మధ్య చెత్తకుప్పలు తొలగించారు. మంచినీటి బోర్లు, కుళాయిల వద్ద క్లోరినేషన్ చేయించారు. పూడికలను ట్రాక్టర్ ద్వారా బయటకు తీసుకువెళ్లి పారబోయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామ సచివాలయం పరిధిలోని శివాజీ దిబ్బలపాలేం, కె.మత్స్యలేశం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. నాలుగేళ్లుగా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల వలసల నియంత్రణకు ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. బుడగట్లపాలెంలో రూ.365 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఏడాదిన్నర వ్యవధిలో నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే చేపల వేట మెరుగవుతుందని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. గతంలో పాకిస్థాన్‌కు పట్టుబడ్డ 22 మంది మత్స్యకారుల విడుదలకు కృషిచేశామని, రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించామని గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రగతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, పీఆర్ ఏఈ సూర్యచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యచంద్ర, వెలుగు ఏపీఎం రామ్మూర్తి, ఉపాధి హామీ ఏపీఓ శోభాదేవి, ఎలక్ట్రికల్ ఏఈ హరికృష్ణ, డీఎఫ్ఓ ముసలయ్య, సర్పంచ్ మూగి ఈక్షిత, ఎంపీటీసీ చోడిపల్లి వలసమ్మ, ప్రజా ప్రతినిధులు, నాయకులు మూడి శ్రీరాములు, మాడుగుల మురళీధర్‌బాబా, నక్క కృష్ణమూర్తి, బోర సాయిరాం, సనపల నారాయణరావు, దుంప చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లు


మాట్లాడుతున్న ఎంపీపీ అంబటి నిర్మల

శ్రీకాకుళం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన శ్రీకాకుళం రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబటి నిర్మల అధ్యక్షతన సజావుగా సాగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఉషాకుమారి మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి ఎరువులు నిల్వ చేసేందుకు గొడౌన్‌లు కావాలని, వాటికి రైతులు సహకరించాలని కోరారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువులు నిల్వ చేస్తే ఆర్‌బీకే యంత్రాలు దెబ్బతింటాయని, ప్రధాన కేంద్రాల్లో ఎరువులు దాచేందుకు గోదాములు కావాలన్నారు. పంట పొలాల్లో డ్రోన్‌ల ద్వారా పురుగుల మందు చల్లేందుకు సబ్సిడీపై డ్రోన్‌లు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక అధికారి దిలీప్ మాట్లాడుతూ పశువులన్నింటికీ డీవార్మింగ్ చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం మండలానికి అత్యవసర సేవల నిమిత్తం అంబులెన్స్ మంజూరైందన్నారు. ఎంఈఓ జి.కృష్ణారావు మాట్లాడుతూ జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి రెండోవిడత నాడు–నేడు పనులు పూర్తి చేస్తామన్నారు. గృహనిర్మాణశాఖ అధికారి మాట్లాడుతూ మండలంలో 2095 జగనన్న ఇళ్లకు గాను 714 పూర్తిస్థాయిలో నిర్మాణమైనట్లు తెలిపారు. సానివాడలో బీసీ కాలనీకి నీరు అందడం లేదని ఎంపీటీసీ రుప్ప అప్పలసూరి ఫిర్యాదు చేయగా, కుందువానిపేట సర్పంచ్ సూర్యం మాట్లాడుతూ హుద్‌హుద్ ఇల్లు కట్టి చాలా రోజులైనా ఇప్పటికీ ఏ ఒక్కరికీ ఇల్లు అందించలేదన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ రాధామాధవి మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు తీసుకుంటున్నామని, ఇంతవరకూ శ్రీకాకుళం రూరల్ మండలానికి 585 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామని వివరించారు. ఇంకా అర్హులు ఉంటే పీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చని చెప్పారు. సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రుప్పదివ్య, ఎంపీడీఓ రఘు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం


సభలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన మంగళవారం జరిగింది. మండల పరిషత్ నిధులు రూ.20 లక్షలతో మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి వరకు సిమ్మెంటు రోడ్డు నిర్మాణం, రూ. 5 లక్షలతో డీపీకేర్స్ భవనం, 15వ ఆర్థిక సంఘం నుంచి 15 గ్రామాల్లో రూ.61 లక్షలతో 39 సీసీ రోడ్లు నిర్మించేందుకు 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం పలు సమస్యలపై సభ్యులు ప్రశించగా అధికారులు సమాధానం చెప్పారు. ఉపాధి హామీ పనులకు గరిష్ట వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి కల్పనకు జలజీవన్ మిషన్ పనులు సత్వరం చేపట్టాలని, నారాయణపురం ఆయకట్టుకు సంబంధించి శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, అల్లినగరం, అరిణాం అక్కివలస, కేశవరావుపేట ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని, జగనన్న, వైఎస్సార్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో జియో ట్యాగింగ్ చేసి బిల్లులు చెల్లించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, తహసీల్దార్ టి.సత్యనారాయణ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పాత్రునివలస జాతీయ రహదారిపై సాయిడెంటల్ కళాశాల సమీపంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు రూరల్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి కల్పించాలి

సరుబుజ్జిలి: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని కల్పించడం జరుగుతుందని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు తెలిపారు. మండలంలోని రొట్టవలస అమృత్ సరోవర్ చెరువు పనులు మంగళవారం పరిశీలించారు. గట్టును అభివృద్ధి చేయడం, ట్రెంచ్ ఏర్పాటుతోపాటు, గట్టుపై మొక్కలు అధికంగా పెంచి పార్కు మాదిరిగా తయారు చేయాలని సూచించారు. గరిష్ట వేతనం అందేలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఏపీడీ రాధ, ఏపీఓ పార్వతి పాల్గొన్నారు.

హిరమండలం: ఉపాధి పథకం ద్వారా పనులు చేపడుతున్న వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయలంలో హిరమండలం క్లస్టర్ పరిధిలోని పాతపట్నం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు సంబంధించిన ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

13న జాతీయ లోక్ అదాలత్

పొందూరు: ఈ నెల 13న స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ కోరారు. స్థానిక పోలీసులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. రాజీపడేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీకి అనుకూలమైన కేసులను మాత్రమే పరిష్కారం చేస్తామన్నారు. పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం


ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

జి.సిగడాం మండలంలోని నిద్దాం పంచాయతీ శ్రీరాంపురం(అధ్వాన్నంపేట)లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లి చల్లదనం చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

-జి.సిగడాం

దివ్యాంగులకు స్కూటర్లు


స్కూటర్ తాళాలు అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

స్థానిక బాపూజీ కళామందిర్ వద్ద మంగళవారం నగరానికి చెందిన 10 మంది దివ్యాంగులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్కూటర్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.1.20 లక్షల విలువైన ట్రైమోటార్ సైకిళ్లను మంత్రి చేతుల మీదుగా అందజేసారు. ఈ వారంలో జిల్లా వ్యాప్తంగా 80 మందికి వాహనాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, దివ్యాంగుల శాఖ సూపరింటెండెంట్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

–అరసవల్లి


స్కూటర్లపై దివ్యాంగులు

వేడుకగా తిరువీధి ఉత్సవం


రజత కవచధారణలో స్వామివారు


రథంపై ఊరేగుతున్న స్వామివారు


గరుడవాహనంపై దేవేరులతో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, అనువంశిక ధర్మకర్త జస్టిస్ గురుగుబెల్లి యతిరాజుల పర్యవేక్షణలో గరుడ వాహనంపై భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరింపచేసి ఆసీనులను చేశారు. భక్తులు స్వామివారిని కీర్తిస్తూ రథాన్ని లాగుతూ ఊరేగింపు చేపట్టారు. గరుడవాహనాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. ఉదయం స్వామివారు రజత కవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఈఓ శ్యామలరావు, వేంకటరామానుజ సేవాదళం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోహనరావు సేవలు చిరస్మరణీయం


మోహనరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నేతల

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళిత ఉద్యమ నేత, సామాజిక ఉద్యమకారుడు బేసి మోహనరావు సేవలు చిరస్మరణీయమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు అన్నారు. ఇలిసిపురంలోని డా.బి.ఆర్ అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారం మోహనరావు 2వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో 40 ఏళ్లపాటు అంబేడ్కర్ ఆలోచన విధానంతో దళిత ఆదివాసీల రాజ్యాంగపరమైన హక్కుల పరిరక్షణకు నిబద్ధతగా పనిచేసిన అంబేడ్కర్ వాది బేసి మోహన్‌రావు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు వాడాన కృష్ణారావు, కల్లేపల్లి రాంగోపాల్, బడియా కామరాజు, కంత వేణు, లింగాల గరికవాడు, మిస్కా కృష్ణయ్య, అంపోలు ప్రతాప్, యజ్జల గురుమూర్తి, లాస సోమేశ్వరరావు, నివిర్తి శ్యామ్‌సుందర్, లింగాల అప్పన్న, యడ్ల జానకిరామ్, నగిరి శ్రీనివాసరావు, తెప్ప పాండురంగారావు, గండుబారికి చిరంజీవిరావు, బత్తిన మోహనరావు, నగిరి శ్రీనివాసరావు, రాజు మాస్టారు, పొట్నూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతికోత్సవాలు


చిలకపాలెం బృందం నృత్య రూపకం

సీఐటీయూ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సంయుక్త నిర్వహణలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో జరుగుతున్న మేడే సాంస్కృతికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముందుగా గాయత్రి ఆర్కెస్ట్రా కళాకారుల గీతాలాపనలు, ఎస్ఎఫ్ఐ గీతాలాపనలు, నృత్య ప్రదర్శనలు, ముళ్లపూడి రామచంద్రరావు దుర్యోధన ఏకపాత్రాభినయం, చిలకపాలెంకు చెందిన రామారావు బృందం రైతుల నృత్య రూపకం ఆకట్టుకున్నాయి. చిన్నారి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమదాలవలసకు చెందిన శివ మిమిక్రీ ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో నిర్వాహకులు వి.జి.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్


ఎస్ఎఫ్ఐ విద్యార్థుల గీతాలాపన


ఏకపాత్రాభినయ ప్రదర్శన


ఆకట్టుకున్న చిన్నారి నృత్యం